లక్షుంపల్లిలో తొలగించిన పత్తి పంట

ప్రజల రక్షణకే ప్రాధాన్యత

పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న హోం మంత్రి వంగలపూడి వనతి

- నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలి
- గత పాలనలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత
- అనంతలో ఘనంగా డీఎస్పీ పాసింగ్ అవుట్ పరేడ్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కు ప్రాధాన్యతను ఇచ్చేలా పోలీసులు విధులు నిర్వహించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావు, ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రొబేషనరీ డీఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మాట్లాడుతూ దేశ రక్షణ, రాష్ట్ర ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడటానికి పోలీసు వత్తిని ఎంచుకోవడం హర్షణీయం అన్నారు. పోలీసు ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదని, ఇందులో మీరు 24/7 విధుల్లో ఉండాల్సి ఉంటుందన్నారు. నిజాయితీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధులపై నిబద్ధతలను కలిగి ఉండాలన్నారు. సమాజాన్ని సుస్థిరంగా ఉంచి శాంతిభద్రతలు కాపాడే కీలక బాధ్యతలు కలిగి ఉంటారన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా, నేరం జరిగినా వెంటనే స్పందించి పరిష్కారం చూపే పోలీసు వ్యవస్థను అందరూ గౌరవించాలన్నారు. పోలీసుశాఖకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. పోలీసుల గౌరవం పెంచేదిశగా ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. గత ఐదేళ్లలో పోలీసుశాఖ నిర్వీర్య అయ్యిందన్నారు. ఫింగర్ ప్రింట్, ఐడెంటిఫికేషన్ టూల్స్‌కు కూడా డబ్బు ఇవ్వని పరిస్థితి ఉండేదన్నారు. కనీసం అప్పాను నిర్మించలేని దుస్థితిని చూశామన్నారు. గ్రేహౌండ్స్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సంపూర్తిగా నిధులు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం రూ.9 కోట్లుకు యుసిసి ఇవ్వకపోవడం వల్ల రూ.200 కోట్లు ఆగిపోయి పెండింగ్‌లో నిలిచాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేసే దిశగా అడుగులు ముందుకు వేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే ముఖ్యమంత్రే స్వయంగా ఆయా జిల్లాల ఎస్పీలతో మాట్లాడి అప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నారంటే ఈ ప్రభుత్వానికి మహిళలు, చిన్నారుల రక్షణపై ఉన్న చిత్తశుద్ధి అవగతం అవుతోందన్నారు. 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం సుమారు రూ.600 కోట్లు పోలీసు సంక్షేమం, సౌకర్యాల కల్పనకు కేటాయించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఆధునీకరణలు చేయాల్సి ఉందన్నారు. సాంకేతికతను ఉపయోగిస్తూ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీసు విధుల్లో ఉన్న వారంతా నిష్పక్షపాతంగా, నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ విషయంలో రాజీపడకుండా బాధ్యతగా వ్యవహరించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న వంగలపూడి అనిత

మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

విధులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
డిజిపి ద్వారకా తిరుమల రావు

శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలు పోలీసు విధులు, చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ప్రజలకు పోలీసు సేవలను అందించాలని డిజిపి ద్వారకా తిరుమలరావు సూచించారు. దశల వారీగా నిర్వర్తించే ప్రొబేషనరీ విధుల సందర్భంగా కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు ఉన్న సాధక బాధకాలు తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. చట్టాలపై సమగ్ర అవగాహన చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, నిర్భయంగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిచాలన్నారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ రెండూ కీలకమే అన్నారు. పోలీసు సేవలు అవసరమైన వారి పట్ల మరింత సానుభూతితో ఉండాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్ ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. సైబర్ ఫోరెన్సిక్ విషయంలో కొత్త టూల్స్ కొనుగోలు చేసే ప్రణాళికతో ఉన్నట్లు తెలిపారు. మానసికంగా వేదనకు గురిచేసే సోషల్ మీడియా నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, చిన్నారులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండటం, చివరి వరకు నిజాయితీగా, అంకితభావంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించడం ప్రతీ పోలీసుకు ముఖ్యమని డిజిపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్, ఐజిపి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పోలీసు శాంతిభద్రతల విభాగం ఐజిపి సిహెచ్.శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి, అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎస్పీలు పి.జగదీష్, వి.రత్న, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాస్, జెసి.అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, అనంతపురం నగర మేయర్ వసీంతో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, పలువురు సిఐలు, ఎస్ఐలు, శిక్షణ ముగించుకున్న డీఎస్పీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పతకాలు అందజేత

డీఎస్పీల శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో రాణించి, ప్రతిభ కనపరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోంశాఖ మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. అంతకు మునుపు మంత్రి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు.

దిగుబడి రాదని దున్నేశారు..!

- పత్తి పంట రైతులకు కష్టం
- వేలాది రూపాయలు మట్టిపాలు

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, వేలాది రూపాయలు అప్పులు చేసి పంట పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం లేకపోవడంతో రైతులు సాగుచేసిన పత్తి పంటలను దున్ని తొలగించేస్తున్నారు. దిగుబడి లేని పంట ఉన్నా.. లేకున్నా ఒక్కటే అన్న ఆలోచనతో ట్రాక్టర్లతో దున్ని తొలగించేస్తున్నారు. ఆరుగాలం కుటుంబం అంతా శ్రమించిన కష్టం మట్టిపాలవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పెట్టుబడులు సైతం చేతికందక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఒకవైపు ఖరీఫ్‌లో నమ్ముకున్న వేరుశనగ పంట రైతులను నిలువునా ముంచేసింది. సరిగ్గా విత్తనం సాగుచేసే సమయంలో వానలు మొహం చాటేశాయి. విత్తనం భూమిలో వేశాక అతివష్టి రైతలకు శాపంగా మారింది. సహజంగా ఈ ప్రాంతంలో నల్లరేగడి నేలలు పత్తి, శనగ సాగుకు అనుకూలంగా ఉండడంతో ఒకవైపు వేరుశనగ, మరోవైపు శనగ, లేదా పత్తి పంటను రైతులు సాగుచేసుకుంటున్నారు. ఒక పంట నష్టాన్ని తెచ్చిపెట్టినా మరో పంట లాభదాయకంగా ఉంటుందన్న అశాభావంతో రైతులు ఈపంటలు సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది రెండు పంటలూ అతివష్టి కారణంగా పూర్తిగా చేతికందకుండా పోయాయి. విత్తనం, వ్యవసాయ పనులకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాలేదు. దీంతో కాపులేని పంటను దున్నేస్తున్నారు. వరుస పంట నష్టాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు రైతును కలవర పాటుకు గురిచేస్తున్నాయి. ప్రతి ఏటా పంట చేతికందే సమ యానికి అతివృష్టి లేదా అనావృష్టి రైతు కొంప ముంచు తున్నాయి. రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఒకవైపు కుటుంబ ఖర్చులకి, మరోవైపు పంట పెట్టుబడులు ఖర్చులకి రైతులు భయపడి పోతున్నారు. చాలా మంది రైతులు అప్పుల పాలై కుటుంబపోషణ భారంగా మారి ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిరంత్సాహంతో రైతులు పంటలు పండు తాయన్న నమ్మకం కోల్పోయి పత్తి పంటను దుక్కుదున్ని బీడుగానే మార్చి వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకు నేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులు కోరుతున్నారు.

రైతుకష్టం మట్టిపాలు

"మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన పుట్లూరు ఈశ్వరరెడ్డి పత్తి పంటను సాగు చేశాడు. కాయలు కాసినా అవి పరిపక్వం చెంది కాయలో పత్తి విచ్చుకునే విధంగా కాయ పగలలేదు. ఆ కాయలలో గులాబీ రంగు పురుగు ఆశించి పంట మొత్తం నాశనం అయింది. మరి కొన్నాళ్లు వేచిచూసినా పంట చేతికందే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించలేదు. దీంతో ఆవేదన చెందిన సదరు రైతు తన రెండెకరాల పొలంలో సాగుచేసిన పంటను పూర్తిగా దున్ని తొలగించాడు. మండలంలో ఇలాంటి రైతులు చాలానే ఉన్నారు".

జంగాలపల్లి పెద్దన్నను పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ధర్మవరానికి చెందిన సిపిఎం నాయకులు జంగాల పల్లి పెద్దన్న రెండు రోజుల క్రితం ధర్మవరం పట్టణంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదపు తప్పి గాయపడ్డాడు. బెంగుళూరులో చికిత్స పొందుతున్న జంగాల పల్లి పెద్దన్నను సోమవారం రాత్రి సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తో పాటు పలువురు సిపిఎం నాయకులు పరామర్శించారు.

పెద్దన్నను పరామర్శిస్తున్న ఇంతియాజ్

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

10న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి-ధర్మవరం

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 10వ తేదీన కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మహాసభ ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం రామగిరి మండల యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. రామగిరి మండలం కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్‌సిని అమలు చేయాలన్నారు. బకాయి పడ్డ డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐసిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం రామగిరి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బాలగొండ్ల శివయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.వినయ్ కుమార్, రామగిరి మండల గౌరవ అధ్యక్షులుగా ఆర్.గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షురాలుగా బి..పద్మజ, ఉపాధ్యక్షులుగా శివారెడ్డి, కోశాధికారిగా సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా సకల చంద్రశేఖర్, ఇ.మల్లేష్, ఎం.ఆదినారాయణ, రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా సి.తులసమ్మ, ప్రసాద్, మల్లికార్జునలను ఎన్నుకున్నారు.

నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరందిస్తాం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందిస్తామని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ధర్మవరం చెరువు మరవనుండి రావులచెర్వు గ్రామ పంచాయతీకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూధర్మవరం నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చడానికి సిఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. నీరు ఉంటేనే ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగం,గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని అన్నారు. ఈసందర్భంగా ఏడవ మరువ వద్ద గంగపూజ చేసి తూములు ఎత్తి రావులచెరువుకు నీరు విడుదల చేశారు. ప్రస్తుతం రావులచెరువుకి నీరు విడుదల చేశామని ఈ మార్గంలో మల్లాకాల్వ, సి.బత్తలపల్లి ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ధర్మవరం చెరువు నుంచి వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. గతంలో నిర్జీవంగా మారిన సాగునీటి వనరులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో జీవం పోస్తున్నామని వివరించారు. 2014-19 సమయంలో పెద్ద ఎత్తున డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇచ్చి రైతులను ప్రోత్సహించారన్నారు. ఇప్పుడు మరోసారి డ్రిప్పు, స్ప్రింక్లర్లు సబ్సిడీతో అందిస్తున్నారని రైతులు సద్వినియోగం చేసుకొని నీటిని ఆదా చేయాలని శ్రీరామ్ సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేష్ చౌదరి, రావులచెర్వు వరిమడుగు చెన్నారెడ్డి, మండల నాయకులు పోతుకుంట లక్ష్మన్న, విజయ్ చౌదరి, మల్లకాల్వ రాంమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులకు మానిటరింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. నూతనంగా ఏర్పాటు అయిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించారు. ఈ తొలి సమావేశంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్డీవోలు, నూతన కమిటీ సభ్యులు వీరనారాయణ, శ్రీనివాసులు, రామాంజనప్ప, ఉమాశంకర్, శ్రీనివాసులు నాయక్, గంగులయ్య, కృష్ణమూర్తి ,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్ ,గిరిజన సంక్షేమ అధికారి రాము నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎల్‌డిఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ స్థాయిలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించాలని దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భూకబ్జాలు భూ వివాదాలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. గ్రామస్థాయిలో అట్రాసిటీ చట్టాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కేసుల పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమాలు బాధితులకు అందించిన పరిహారంపై కలెక్టర్ అధికారులతో ఆరా తీసి వాటిపై చర్చించారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి అట్రాసిటీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వీరనారాయణ మాట్లాడుతూ నల్లమాడ మండలం ఎర్రవంకపల్లిలో దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పెడపల్లిలో ఎస్టీల భూములను కొందరు కబ్జా చేస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గోరంట్లలో ఎస్సీలకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఉమాశంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్‌డిఒ సువర్ణ ,పెనుగొండ, ధర్మవరం, కదిరి ఆర్డీవోలు ఆనంద్ కుమార్, మహేష్, శర్మ ,పెనుగొండ, హిందూపురం, కదిరి డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శివ నారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు

త్వరలో జిల్లాలో నిర్వహించే నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘం ఎన్నికల మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయ సారధి, ఈఈ రాధాకృష్ణ, డీఈ గంగాధర్, ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్ కుమార్, మహేష్, శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు చెరువులు కింద 230 స్థానాలకు సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలకు ఈనెల 23 తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో గొడవలు తలెత్తకుండా మైనర్ ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. ఓటర్ లిస్టును తప్పులు లేకుండా తయారు చేయాలని, నోడల్ ఆఫీసర్లు జాబితాన్ని సిద్ధం చేయాలని, మైనర్ ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరగాలని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కలిసికట్టుగా కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, మైనర్ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలి : సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర ప్రతినిధి వర్గంతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలు,సర్కులర్ వెంటనే విడుదల చేయాలపి సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి సౌమ్య,గుట్టూరు పి హెచ్ సి వైద్యాధికారి నాగరాజు నాయక్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ 9 నెలలు కావస్తున్న జీవోలు విడుదల కాకపోవడంతో ఆశ వర్కర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో అనేకమంది ఆశ వర్కర్లు రిటైర్డ్ అయ్యారని చెప్పారు. రిటైర్డ్‌మెంట్ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంపుదల జీవో రాకపోవడంతో ఆశ వర్కర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కూడా అందలేదని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు తులసి, అలివేలమ్మ, రాజేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు కమల్ బాషా ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు, ఒప్పందం జరిగి 9 నెలలు కావస్తున్న ఇప్పటివరకు జీవో విడుదల కాకపోవడంతో ఆశ వర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసు నమోదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని మండ్లి గ్రామానికి చెందిన వికలాంగురాలైన మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెనుకొండ సిఐ రాఘువన్, స్థానిక ఎస్ఐ రమేష్ బాబు పేర్కొన్నారు. గ్రామంలో మూగ, చెవుడు ఉన్న ఒంటరి మహిళ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోదన్నారు. మూడవ తేదీ అర్ధరాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఆమె ఇంటిలోకి చొరబడి అత్యాచార యత్నానికి పాల్పడ్డారన్నారు. దీంతో ఆమె భయపడి బయటికి పారిపోయిందన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

నవదీపక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని పులమితి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నవదీపక్ 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 102 ప్లస్ కేటగిరిలో కాంస్య పతకం సాధించారు. గుంటూరు జిల్లా తెనాలిలో రెండవ తేదీన నుండి నాలుగో తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవదీపక్ ప్రతిభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఉపాధ్యాయులు, పీడీ రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మదిగుబ్బ మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులతోనూ ఉపాధి కూలీలతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బాల్యవివాహాలు నేరం

ప్రజాశక్తి - రొద్దం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. మంగళవారం మండలంలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని డాక్టర్ శాంతలక్ష్మి, ఆర్‌డిటి మడకశిర రిజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఎస్ఐ నరేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొద్దంను బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. బాల్యవివాహాలను చేసినా, ప్రోత్సహించినా వర్తించే శిక్షల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి టి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ, హెచ్ఎం రామాంజినేయులు, ఉపాధ్యాయులు పుణ్యవతి, రాజశేఖర్, మహేష్, మహిళా పోలీసు లలిత, అంగనవాడీలు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని గరిశలపల్లిలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం పంటకోత ప్రయోగాలను చేపట్టారు. గ్రామానికి చెందిన రంగారెడ్డి సర్వే నెంబర్ 78-2 పొలంలో సాగుచేసిన ఆముదం పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి కేఎల్ లక్ష్మీనరసింహశర్మ, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ కోఆర్డినేటర్ చంద్ర, ఇన్సూరెన్స్ ఏజెంట్లు మంజునాథ, మహేష్, చాంద్‌బాషా, ఎంపిఇఒ రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై మట్టిని తొలగించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులో ప్రధాన రహదారులపై మట్టి దుమ్ము ధూళి పేరుకొని పోయిందని దీనితో వాహనాలు వెళ్లేటప్పుడు ప్రజలు, విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్ అన్నారు. రహదారుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అలాగే రోడ్ల పైన హోటళ్ల నిర్వాహకులు నీరు పోస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకుడు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా పెద్దన్న

ప్రజాశక్తి - ముదిగుబ్బ

సిపిఎం మండల కార్యదర్శిగా పెద్దన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రంలో మంగళవారం సిపిఎం శాఖా సమావేశాన్ని నిర్వహించారు. సత్యసాయి జిల్లా కమిటీ సభ్యులు జిఎల్ నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జెకె పల్లి గ్రామ భూ పోరాటం, మండలంలో శ్మశాన వాటికలు, పంచాయతీ వర్కర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం మండల కార్యదర్శిగా పెద్దన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి హాజరైన హోం మంత్రి వంగలపూడి అనితను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి సత్కరించారు.అదేవిధంగా పి టి సి గెస్ట్ హౌస్ లో ఉన్న డిజిపి ద్వారకా తిరుమలరావును వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను హోం మంత్రి అనిత, డిజిపి తిరుమలరావు దృష్టికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి తీసుకొచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గం లో పలు స్టేషన్లో పోలీసు సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించారు. ఎన్నోఏళ్ళ క్రితం పోలీసులకు ఇచ్చిన వాహనాలు కాలం చెల్లి పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి ఎంతోమంది వివిఐపిలు, విఐపిలు వస్తుంటారని ఇక్కడ పోలీస్ యంత్రాంగం ఎంతో పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు పోలీస్ సిబ్బందితోపాటు నూతన పోలీసు వాహనాలను, జిల్లా ఎస్పీ నూతన కార్యాలయం తో పాటు ప్రత్యేక పోలీస్ గెస్ట్ హౌస్ ను మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. అలాగే నల్లమాడ, ఆమడగూరు, పుట్టపర్తి, బుక్కపట్నం పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి తెలిపారు.

చక్కెర వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని పెన్షనర్ల భవనంలో మంగళవారం న్యూట్రిషన్ డాక్టర్ బైసాని మేఘన చక్కర వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ మేఘన మాట్లాడుతూ చక్కెర వ్యాధి ఉన్నప్పుడు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు, శనగలు, మెంతులు నీటిలో నానబెట్టి ఆ నీటిని భోజనానికి ముందు ఉదయం తాగాలన్నారు. దీనివలన చక్కెర వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రఘురాం రెడ్డి, గోవిందరెడ్డి, శ్రీరాములు రెడ్డి, కేశవ్ ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, సాయి ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ ప్రొప్రైటర్ బైసాని రాజేష్ గుప్తా, పద్మ, రేఖ, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో తాగునీటి కష్టాలు

కెజిబివి సిబ్బందితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అధికారుల తీరుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో తాగనీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుండి తాగడానికి నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఆపార్టీ నాయకులు జిల్లా నరసింహులు ఆధ్వర్యంలో మంగళవారం కెజిబివిని సందర్శించారు. విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న తాగునీటి బోరు మరమ్మతుకు గురికావటంతో సమస్య తలెత్తినట్లు గమనించారు. ఈ విషయంపై పాఠశాల అధికారులు, నాయకులు చొరవ తీసుకోకపోవడంతో విద్యార్థినులు పాఠశాల నుండి బయటకు వచ్చి చుట్టుపక్కల ఉన్న గృహాల వద్దకు వెళ్లి దప్పిక తీర్చుకుంటున్నారని తెలిసి సిపిఎం నాయకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు నీరు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. పాఠశాలకు పంచాయతీ వాటరు సప్లై చేయించి రిపేరులో ఉన్న బోరును మరమ్మతు చేయించాలని సూచించారు. విద్యార్థులను బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తే ఏర్పడే పరిణామాలకు పూర్తి బాధ్యత పాఠశాల సిబ్బంది, ఉన్నత అధికారులదే అని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, మధుసూదన్ రెడ్డి, అవాజ్ కమిటీ బాబ్జాన్ తదితరులు హెచ్చరించారు.

యుటిఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - మడకశిర

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. నియోజకవర్గ పరిధిలోని రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ రొళ్ల మండల అధ్యక్షులు ఏ. అనిల్ కుమార్, కోశాధికారి అనిల్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యుటిఎఫ్ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ 10వ తేదీ కదిరి పట్టణంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభల్లో అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రొళ్ల మండల నాయకులు శ్రీకాంత్ , రమేష్ బాబు, ఖాదర్ వలీ, రవీందర్ రెడ్డి, స్వరూపారాణి, రోహిణి, నాగలక్ష్మి, గంగాదేవి, చిన్నప్పయ్య, నరేంద్ర, జి. రామాంజనేయులు, వినోద్, ముస్కర్, నాగరూప, శోభారాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని బండ్లపల్లిలో జరిగిన ఘర్షణలో గాయపడిన బాధితుడిని ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ మంగళవారం పరామర్శించారు. ఓ స్టోర్ వివాదంలో చెలరేగిన ఘర్షణలో గాయపడి అనంతపురం జిల్లా సర్వ జన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన ఎంపిపి జరిగిన ఘటనపై ఆరా తీశారు.

కేక్ కట్ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

విజేతకు బహుమతి అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

'సోనాలిక' విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -కదిరి టౌన్

ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ సోనాలిక కంపెనీ, కదిరి యువ రైతు ఆగ్రో టెక్ సంయుక్తంగా గత జూన్ నెలలో నిర్వహించిన జూన్ జాక్ పాట్ అనే కార్యక్రమం ద్వారా సోనాలిక ట్రాక్టర్లు కొనుగోలు చేసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఎంపికైన వారికి మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. కదిరి పట్టణంలోని సొనలిక ట్రాక్టర్ షోరూంలో జిల్లా మేనేజర్ జయరాం ,యువ రైతు ఆగ్రో టెక్ డీలర్ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ లక్కీ డ్రాలో మొదటి బహుమతి నల్లమాడ మండలం బసిరెడ్డిపల్లి కి చెందిన రైతు ఆనంద్ కి రూ.25వేల విలువ గల మొబైల్ ఫోన్ అందజేశారు. అలాగే ముదిగుబ్బ మండలానికి చెందిన ఆంజనేయులుకు రూ.6,500 విలువ గల రిస్ట్ వాచిని అందజేశారు. ఈ సందర్భంగా డీలర్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సోనాలిక చైర్మెన్ మిట్టల్ జన్మదిన సందర్భంగా బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మేనేజర్ జయరాం, కదిరి క్లస్టర్ బాలకృష్ణ, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్‌మీట్

కౌన్సిల్‌మీట్‌లో సభ్యుల వాదోపవాదాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ నజీమున్నీసా అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. కదిరి మున్సిపాలిటీలో వాహనాలకు పట్టే డీజల్‌లో అవకతవకలు, మున్సిపల్ స్థలాల కబ్జాలపై చర్యలకు తీవ్ర చర్చ జరిగింది.అందుకు కారకులైన వారిపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు పట్టపట్టారు.తొలుత అజెండాలో పొందు పరచిన 51 అంశాలలో 39 అంశంపై కౌన్సిలర్ కృపాకర్రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణ వ్యాప్తంగా మున్సిపల్ స్థలాలు ఎన్ని ఉన్నాయి, అవి ఏమైనా కబ్జాకు గురయ్యాయా? సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంశంలోని పనులు ఎక్కడా జరగలేదని, పైపులను కాంట్రాక్టర్ తీసుకెళ్లాడని ఆయన వద్ద నుండి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఓడీసీ ఫకృద్దీన్ అనే వ్యక్తి 10 సెంట్లు ఆక్రమి ంచుకొన్నారని, ఆక్రమించుకొన్న స్థలానికి మున్సిపల్ అధికారులు ఎలా ప్లానింగ్ ఇచ్చారని ప్రశ్నించారు. కౌన్సిలర్ షబ్బీర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వార్డులలో కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మత్తులు చేయాలని కోరారు. కౌన్సిలర్ సీఏ ఇస్మాయిల్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో పారిశుధ్యం పేరుకుపోయిందని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పట్టణ వ్యాప్తంగా ఉన్న హోటల్ నిర్వాహకులు నాణ్యత లేని కూరగాయలతో వంటలు చేస్తున్నారని, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల కాలంలో సెలార్ల నిర్మాణం ఎక్కువగా జరుగుతోందని, అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకొంటామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొండూరు విద్యార్థులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్ బాల్, , బేస్ బాల్, నెట్ బాల్ విభాగంలో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనంతపురంలోని ఆర్ డి టి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 17 సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినకొండూరు విద్యార్థి దుర్గాప్రసాద్, అండర్ 14 బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లలిత, అండర్ 14 విభాగంలో మొదటి స్టాండ్ బైగా పరమేష్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ పాల్ పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా బేస్ బాల్ విభాగంలో అండర్ 17 బేస్‌బాల్ లో నౌషద్, అండర్ 14 విభాగంలో లోహిత్, ప్రభాకర్ ఎంపికయ్యారు. ఇక నెట్ బాల్ విభాగంలో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 9వ తరగతి విద్యార్థి నాని, 8వ తరగతి విద్యార్థిని నవ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

గత పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి టౌన్

గత పాలకుల నిర్లక్ష్యంతో తలుపుల, నంబులపూలకుంట రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఎన్నికల సమయంలో తలుపుల, ఎన్ పి కుంట మండలాల రైతులకు ఇచ్చిన మేరకు మంగళవారం కదిరి రూరల్ మండలం పట్నం వద్ద హంద్రీనీవా కాలువ నుంచి తలుపుల, ఎన్ పి కుంట మండలాలలో సాగు తాగునీరు కోసం కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలోని రెండు మండలాల ప్రజలు తాగు, సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో గతంలో ఇచ్చిన హామీ మేరకు రెండు మండలాలకు నీరు విడుదల చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో ఇఒఆర్‌డిలదే కీలకపాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పంచాయతీలను అభివృద్ధి పరచడంలో ఈవోఆర్డీల పాత్ర కీలకమైందని శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీల అభివృద్ధిపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపిఒ సమత, డిఎల్‌పిఒలు శివకుమారి, అంజనప్ప, శివ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా పరిధిలోని 32 మండలాల ఈవోఆర్డీలు, డిఎల్‌పిఒలు, మండల కోఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి కీలకమైందని గ్రామాల్లో పరిశుభ్రత పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇంటి గుత్తలు, నూతనగృహాల నిర్మాణాల అనుమతులు తదితర విషయాలపై ఇఒఆర్‌డిలు పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలం నుండి ఒక్కొక్క గ్రామ పంచాయతీని తీసుకొని దానిని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పంచాయతీల రికార్డులు తనిఖీలు చేసి పిఆర్ యాప్‌లో హౌస్ టాక్స్ కలెక్షన్ తదితర అంశాలను అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి నెల హౌస్ టాక్స్ లు ఎంత వసూలు చేస్తున్నారనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. హౌస్ టాక్స్ లు వసూలు కానీ ప్రదేశాలకు ఇఒఆర్‌డిలు, పంచాయతీ సిబ్బంది వెళ్లి వసూలు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ నిధులు వినియోగం, అభివృద్ధి పనులపై అధికారులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇఒఆర్‌డిలు, జిల్లా పంచాయతీ సీనియర్ అసిస్టెంట్

పది పరీక్షల ఫీజు గడువు పెంపుపై హర్షం

ప్రజాశక్తి బత్తలపల్లి

పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయడానికి చెల్లించాల్సిన ఫీజు గడువును పెంపుపై ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం విజయవాడలో ఎస్ఎస్‌సి బోర్డు డైరెక్టర్ దేవానంద రెడ్డిని శ్రీ సత్యసాయి జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పదవ తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా చేపట్టిన విద్యార్థుల ఆపార్ కార్డు విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను గురించి బోర్డు డైరెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్పందించిన డైరెక్టర్ దేవానంద్ రెడ్డి త్వరలోనే ఆపారు కార్డుకు సంబంధించిన ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఒ రవిచంద్ర రెడ్డి, జాయింట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

డిజిపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

డిజిపి ద్వారకా తిరుమలరావును శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంత పురంలోని పిటిసిలో జరిగిన డీఎస్పీల పాషింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డిజిపిని ఆమె కలసి శ్రీ సత్య సాయి జిల్లా శాంతి భద్రత విషయంపై చర్చించారు.

జిల్లాలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎస్పీ ఆదేశాల మేరకు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాలు తనిఖీలు చేశారు. ప్రధాన రహదారులు, హైవేలు ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తూ, ట్రాఫిక్ నియమాల పై అవగాహన కలిగించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని గుత్తి వారి పల్లిలో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. చెరువు కట్టపై ఉన్న గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూదిలికి చెందిన మమత హరినాథ్, వీర నరసింహులు, గోపాల్, అక్కులప్ప, ఈశ్వరప్ప, రామాంజి, గంగాధర, శంకర, తిప్పన్న, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు

టమోటాకు పంటలబీమా సౌకర్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో రబి సీజన్ కు సంబంధించి ఉద్యాన పంటల పరంగా టమోట పంటను వేసిన రైతులకు పంటల బీమాను వర్తించే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ఎకరాకు కంపెనీ వారు 32000 రూపాయల వరకు పంటను బీమా చేయడం జరుగుతుందని దీనికి గాను 10శాతం అంటే 3200 రూపాయలు ప్రీమియం రూపంలో కంపెనీ వసూలు చేసుకుంటుందని చెప్పారు. ఇందులో కేంద్రం రూ.800. రాష్ట్రం రూ. 800 భరిస్తే రైతు మిగిలిన 1600 రూపాయలు చెల్లించాల్సి వస్తుందన్నారు. రైతులు 1 అక్టోబర్ 1 నుంచి డిసెంబర్15 మధ్యలో బ్యాంకు ద్వారా రుణ సదుపాయం పొందితే బ్యాంకుల ద్వారానే ఇన్సూరెన్స్ చేయబడుతుందన్నారు. రుణాలు లేని రైతులు, రైతులే సొంతంగా బీమా చేసుకోవాలనుకునే వారు డిసెంబర్ 15 లోపల కామన్ సర్వీస్ సెంటర్, లేదా బ్యాంకుల ద్వారా లేదా రైతులే సొంతంగా ఎన్‌సిఐపి వెబ్ పోర్టల్ నందు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని 104 సిబ్బంది కోరారు. ఈ మేకు వారు మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారిణి డాక్టర్ జోష్నాకు అందజేశారు. సిబ్బంది, డ్రైవర్లకు మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వలేదని దాంతో కుటుంబాలనుపోషించటం కష్టతరమ వుతోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జీవో నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయాలన్నారు. ఈ కార్యక్రమం లో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మోహన్ బాబు, డ్రైవర్ నరేష్, డిఇఒ లక్షిపతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో హోం మంత్రి విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-హిందూపురం

విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందని శాంతి భద్రతల విషయంలో హోమంత్రి విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. చిలమత్తూరు మండలం నల్ల బొమ్మనపల్లి వద్ద దుండగుల చేతిలో సామూహిక అత్యాచారానికి గురైన కుటుంబాన్ని ఉషశ్రీ చరణ్‌తో పాటు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం పంపించిన రూ. 10 లక్షల విలువైన చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, ఆడపిల్లలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సంఘటనలు జరిగిన సమయంలో హోంమంత్రి పొంతన లేని విధంగా వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు గమనిస్తే హోం మంత్రి ఫెయిల్ అయినట్లేనని, ప్రశ్నిస్తానంటున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దళిత మహిళా మంత్రిని వదిలేసి చంద్రబాబును ప్రశ్నిస్తే బాగుంటుందని అన్నారు. ఏపీలో మహిళలపై అఘాయిత్యాలు అధికమైపోయాయని, రాజకీయాలు పక్కన పెట్టి దిశా చట్టాన్ని యధావిధిగా కొనసాగిస్తే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని క్షమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో వేధింపులు తగదు

కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్, డిగ్రీతో పాటు పదవ తరగతి విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా ఆయా కళాశాల, పాఠశాల యాజమాన్యలు విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు కట్టించు కోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బిసి కళాశాల వసతిగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీతో పాటు పదవ తరగతి విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా పరీక్షా ఫీజులను కట్టించు కోవాలన్నారు. ముఖ్యంగా డిగ్రీ విద్యార్థులకు మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టించుకోవడానికి ఈ నెల ఆరవ తేదీన చివరి తేదీగా ఎస్కే యూనివర్సిటీ ప్రకటించిందన్నారు. అయితే ప్రయివేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు గత సంవత్సరానిది విద్యాదీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్ ఉండడం వల్ల విద్యార్థులు ఆ ఫీజులు కళాశాలలకు చెల్లించలేదన్నారు. డిగ్రీ కళాశాల యాజమాన్యం వారు పెండింగ్ లో ఉన్న ఫీజులు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని తెగేసి చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయలేదన్నారు. ఎన్నికల సందర్భంలో గెలిచిన వెంటనే బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, అదేవిధంగా యూనివర్సిటీ అధికారులు స్పందించి కళాశాల ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న డిగ్రీ కళాశాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, ఆఫ్రిద్, హుస్సేన్, తరుణ్, హసేన్, బాబా ఫక్రుద్దీన్, కిరణ్, రంగా తదితరులు పాల్గొన్నారు.